క్లుప్తంగా

రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలి



ముప్పాళ్ల: కార్డుదారులందరికీ రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ కె.నగేష్ చెప్పారు. మండలంలోని గోళ్లపాడులో శనివారం రేషన్ పంపిణీని శనివారం ఆయన తనిఖీ చేశారు. అన్ని గ్రామాల్లో వీఆర్వోల పర్యవేక్షణలో పంపిణీ జరుగుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వికలాంగులు, వృద్ధులకు వారి ఇంటి వద్దే సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. దుకాణదారులు కూడా సమయపాలనపాటిస్తూ పంపిణీని సక్రమంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో బి.దాసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్యకు ఘన నివాళి



పెదకూరపాడు: మండల పరిధిలోని లగడపాడులో ప్రగడ కోటయ్య 111 జయంతిని శనివారం భావనా రుషి స్వామి ఆలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో లగడపాడు,పెదకూరపాడు, గారపాడు గ్రామాల పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు. ప్రగడ కోటయ్య చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. పల్నాడు జిల్లా జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం మాట్లాడుతూ ప్రగడ కోటయ్య ఆశయాల సాధన కోసం పోరాడాలని చెప్పారు. పెదకూరపాడు నియోజకవర్గం జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం అధ్యక్షుడు గోలి యల్లమందయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు చెన్నంశెట్టి బాజీ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో మండలాల అధ్యక్షులు అనుముల వెంకట్రావు, బండారు వెంకటేశ్వర్లు, సామ్రాజ్యం, రామారావు, సంగెపు శ్రీను, పద్మశాలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం అందజేత



అమరావతి: స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ పూర్వ ప్రధానోపాధ్యాయుడు ముదునూరు అక్షయకుమార్ దత్తు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు కొన్నేళ్లుగా పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారం అందిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరతగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ఐదుగురు విద్యార్థులకు రూ. 5వేల చొప్పున నగదు పురస్కారం అందచేశారు. అక్షయకుమార్ దత్తు భార్య లలిత చేతుల మీదుగా రమ్య, షేక్ పర్వీన్, ఉయ్యాల ఉష, షేక్ అర్సియా కౌసర్, కంభంపాటి కీర్తనలకు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి, జిల్లా క్రికెట్ కమిటీలో అండర్ -14,16,19 సెలక్టర్ డి.భీమారావును పాఠశాల కార్యవర్గం, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు వలివేటి శేఖర్, మాజీ ప్రధానోపాధ్యాయులు కొల్లి లక్ష్మీనారాయణ, సాయిబాబు, దత్తు మాస్టారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అప్రమత్తత అవసరం



సత్తెనపల్లి: ఫ్లోరోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు కూడా వ్యాధిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ కుమార్ తెలిపారు. సత్తెనపల్లి మండలం కో లొకేటెడ్ పీహెచ్‌సీ (పణిదం) పరిధిలోని కంటెపూడి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరంలో జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బోర్‌వెల్ నీళ్లు, పొగాకు సంబంధిత వస్తువులు, బ్లాక్ సాల్ట్, బ్లాక్ టీ వంటివి మితిమీరి ఉపయోగిస్తే త్వరగా ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతారని తెలిపారు. నివారణలో భాగంగా రక్షిత తాగునీరు, కాల్షియం, విటమిన్ -ఈ, విటమిన్ - సీ అధికంగా ఉన్న పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ గురించి గ్రామస్థాయిలో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓలకు,మండల స్థాయి సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించారు. కంటెపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతి పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కమ్యూనిటీ సర్వే కూడా గ్రామాల్లో చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ-సీహెచ్ఓ ఎం.నాని, ఆరోగ్య కార్యకర్తలు జి. చిన్నకోటమ్మ, బీవీ నాగలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేరు సం'క్షేమం' ... తీరు సం'క్షామం'

- వసతి గృహాల్లో విద్యార్థులను వెంటాడుతున్న సమస్యలు
- రాత్రిళ్లు దోమల దండయాత్ర
- సక్రమంగా అమలు కాని మెనూ
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- చేతులెత్తేసిన జిల్లా యంత్రాంగం



సత్తెనపల్లి నిర్మలానగర్‌లోని ప్రీ మెట్రిక్ బీసీ బాలుర వసతి గృహంలో ఆహారానికి క్యూలో ఉన్న విద్యార్థులు

వసతి గృహాలు నరక కూపాలను తలపిస్తున్నాయి. పారిశుద్ధ్యం లోపించడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. హాస్టల్ గదుల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫ్యాన్లు పని చేయకపోవడంతో విద్యార్థులపై యథేచ్ఛగా దాడి చేయడంతో రోగాల బారిన పడుతున్నారు. కాసుల కక్కుర్తితో సిబ్బంది వడ్డిస్తున్న నాసిరకం ఆహార పదార్థాలను తిని ఆరోగ్య స్థితిగతులు దారుణంగా తయారయ్యాయి. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైంది. వసతి గృహాలు వ్యాధులకు అడ్డాగా మారాయి.

సాక్షి గ్రౌండ్ రిపోర్టు SAKSHI GROUND REPORT

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితి అధ్వానంగా తయారైంది. శనివారం సాక్షి విజిట్‌లో నివ్వెరపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. అసలే వానాకాలం కావడంతో హాస్టళ్ల పరిసరాలు మురికి కూపంగా ఉన్నాయి. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేక అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల కిటికీలు పగిలిపోయాయి. కొన్ని చోట్ల మెష్‌లు లేకపోవడంతో విద్యార్థులకు దోమల బెడద తప్పడం లేదు. దీనికి తోడు అన్ని హాస్టళ్లలో సిబ్బంది కొరత ఉంది. వార్డెన్‌లు సొంత ఖర్చులతో కుక్, కమాటీలను నియమించుకొని చేతి చమురు వదిలించుకుంటున్నారు. నిర్వహణకు బడ్జెట్ విడుదల చేయక పోవడంతో పాటు వార్డెన్‌లకు అదనపు బాధ్యతలు అప్పగించటంతో పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంది.

ఇదీ నియోజకవర్గంలో పరిస్థితి

నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ ప్రీ మెట్రిక్, కళాశాల వసతి గృహాలు ఎనిమిది ఉన్నాయి. వీటిలో 1,290 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారు. ఒక్కో వసతి గృహంలో 100 మందికి పైగానే ఉన్నారు. పట్టణంలోని వెంకటపతి కాలనీలో గల ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహంలో అత్యధికంగా 340 మంది విద్యార్థినులను ఉన్నారు. వీరికి బాత్రూంలు, టాయిలెట్స్ 13 మాత్రమే ఉన్నాయి. కనీసం మరో 25 బాత్రూంలు, టాయిలెట్స్ అవసరం. మంచినీటికి రెండు బోర్లు ఉన్నాయి. కొద్ది రోజుల కిందట బిల్డింగ్‌లో బాత్రూంలకు తలుపులు బిగించడంతో పాటు కొన్ని మరమ్మతులు చేశారు. అయితే పూర్తిస్థాయిలో మర్మతులు చేసేందుకు బడ్జెట్ కేటాయించ లేదు. దీనివల్ల విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. వెంకటపతి కాలనీలో గల ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహం, రాజుపాలెంలోని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం మినహా మిగిలినవన్నీ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి.

విద్యార్థులకు వసతులు కరువు

విద్యార్థులకు ప్రభుత్వం కనీస వసతులు కల్పించడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడిచినప్పటికీ ఇంత వరకు దుప్పట్లు, కంచాలు, గ్లాసులు, ట్రంకు పెట్టెలు వంటివి పంపిణీ చేయలేదు. దీంతో గతంలో పంపిణీ చేసిన దుప్పట్లతోనే విద్యార్థులు నెట్టుకొస్తున్నారు. ఒక్కో దుప్పటిని ఇద్దరు విద్యార్థులు వినియోగించుకుంటున్నారు. వర్షాకాలంలో బండలపై నిద్రించేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చలికి ఇబ్బందులు పడుతున్నారు.

అందని కాస్మోటిక్ చార్జీలు

- ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో 3నుంచి 6వరకు చదివే బాలురకు నెలకు ఒక్కొక్కరికి రూ.175, బాలికలకు రూ.130, 7నుంచి 10వరకు చదివే బాలురకు రూ. 200, బాలికలకు రూ. 200 కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలి.
- కళాశాల వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 250ను ప్రభుత్వం ప్రతినెలా చెల్లించాల్సి ఉంది. 2024 సెప్టెంబర్ నుంచి ప్రీమెట్రిక్ వసతి గృహాల విద్యార్థులకు, 2024 మార్చి నుంచి కళాశాల వసతి గృహాల విద్యార్థులకు చార్జీలు రావాల్సి ఉంది.
- ప్రీ మెట్రిక్‌కు సంబంధించిన విద్యార్థులు 387 మందికి 10 నెలలుగా సుమారు రూ. 10 లక్షలు, 903 మంది కళాశాల విద్యార్థులకు 15 నెలలకు గాను రూ.33.86 లక్షలు రావాల్సి ఉంది. వాటిని ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థులు సబ్బులు, కొబ్బరినూనె, షాంపూలు, బట్టలు శుభ్రం చేసే సబ్బులు, తదితర వాటిని కొనుగోలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు.
- కొందరు విద్యార్థులు అయితే సబ్బులు లేకుండానే స్నానాలు చేస్తూ, మురికి బట్టల కారణంగా అపరిశుభ్రతతో అనారోగ్యం పాలవుతున్నారు.

అమలు కానీ మెనూ

ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ అమలు చేయాలంటే సంక్షేమ వసతి గృహాల వార్డన్లు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రీ మెట్రిక్ విద్యార్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.1,400, కళాశాల వసతి గృహ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,600 ప్రభుత్వం డైట్ చార్జీలు రూపేణా విడుదల చేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాలు, కూరగాయల ధరలు అధికంగా ఉండడంతో మెనూ సక్రమంగా అమలుకాని పరిస్థితి నెలకొంది. ధరలు మండి పోతుండడంతో నాసిరకం కూరగాయలనే కొనుగోలు చేస్తూ వార్డెన్లు మమ అనిపిస్తున్నారు.

చాలీచాలని మరుగుదొడ్లు

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 493మంది విద్యార్థులకు గానూ 65 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. అందులో 11 మరమ్మతుల్లో ఉన్నారు. విద్యార్థులు మరుగుదొడ్లు, బాత్‌రూములు చాలక ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి క్లాసులకు వెళ్లలేకపోతున్నారు. పాఠశాలలో ఆర్వో ప్లాంటు సక్రమంగా పనిచేయకపోవడంతో మంచినీళ్ల కోసం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

- కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 257 మంది విద్యార్థునులకు గాను 32మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. కాంపౌండ్‌వాల్ తక్కువ ఎత్తులో ఉంటంవల్ల బాలికలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా పాఠశాల ఆవరణలోకి తరచూ కోతులు ప్రవేశిస్తుండటంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. వర్షం వచ్చినప్పుడు పాఠశాల ఆవరణలోకి నీళ్లు ప్రవేశిస్తున్నాయి.

సమస్యలతో విద్యార్థులు సహవాసం

బెల్లంకొండ: వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. మండల కేంద్రంలో గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల, పాపాయపాలెంలో బీసీ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. గురుకుల పాఠశాలలో సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న వాటిలోనే కొన్ని అధ్వానంగా ఉన్నాయి. స్నానం చేసేందుకు కూడా మరుగుదొడ్లనే ఉపయోగించాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు.

- పాపాయపాలెంలోని బీసీ వసతి గృహంలో కూడా అదే పరిస్థితి నెలకొంది. హాస్టల్లో 80 మంది విద్యార్థులకు గానూ ఐదు మరుగుదొడ్లు మాత్రమే వినియోగించేందుకు అనువుగా ఉన్నాయి. గదుల్లో కొన్ని ఫ్యాన్లు, లైట్లు పనిచేయడం లేదు. విద్యార్థులు భోజనం చేసే గదిలో పైకప్పుకు పెచ్చులు ఊడడంతో దాన్ని మూసివేశారు. దీంతో వర్షం పడుతున్న సమయంలోనూ వరండాలోనే భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. హాస్టల్ ఎదురుగా గుంటలలో మురుగునీరు నిలిచిపోయి ఉండడంతో దోమలతో అవస్థలు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు.



పాపాయపాలెం బీసీ హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు



భోజన గదిలో పెచ్చులూడిన పైకప్పు

మౌలిక వసతులు కరువు

అమరావతి : మండలంలోని ధరణికోటలో గల బీసీ, ఎస్సీ హాస్టళ్లలో 50శాతం విద్యార్థులు కూడా లేని పరిస్థితి ఉంది. ఎస్సీ హాస్టల్‌లో 3 నుంచి 9వ తరగతి వరకు 25మంది విద్యార్థులే ఉన్నారు. భవనం నూతనంగా నిర్మించారు. తక్కువ మంది విద్యార్థులు ఉండటంతో మరుగుదొడ్ల సమస్య లేదు. బీసీ బాలుర హాస్టల్‌లో 23మంది విద్యార్థులు ఉన్నారు. మరమ్మతులు జరగడం వల్ల రూంలలో పెద్దగా సమస్యలు లేవు. ఉన్న మరుగుదొడ్లలో ఐదు పనిచేస్తున్నాయి. స్నానాల గదులకు ఉన్నప్పటికీ వాటికి తలుపులు లేవు. హాస్టల్‌కు ఉత్తరాన క్రోసూరు రోడ్డు వైపు ప్రహరీ లేకపోవటంతో అకుపచ్చ పట్ట కట్టారు. దీంతో విద్యార్థులకు రక్షణ కరువైంది.



ధరణికోట బీసీ హాస్టల్‌లో ప్రహారీగా కట్టిన ఆకుపచ్చ పట్ట

డ్రైనేజీ సమస్యలతో ఇక్కట్లు

స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో డ్రైనేజీ సక్రమంగా లేదు. మురుగు నీరు నిలిచిపోయి విద్యార్థులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. ఇక్కడ 700మందికి పైగా విద్యార్థులు చదుకుకుంటున్నారు. నిత్యం వాడిన నీరు, వర్షపు నీరు బయటకు పోయే వీల్లేక దుర్గంధంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తూర్పు భాగంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో పిచ్చిచెట్లు, కంప పెరిగిపోడంతో విద్యార్థులు అటు వైపు వెళ్లడానికి భయపడుతున్నారు.



తలుపులు లేని స్నానాల గదులు



అమరావతి గురుకుల పాఠశాలలో నిలిచిపోయిన మురుగునీరు

అద్దె భవనాల్లో అగచాట్లు

క్రోసూరు: మండలంలోని రెండు బీసీ వసతి గృహాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వేలాది రూపాయలను అద్దెల కింద చెల్లించుకుంటున్నా వసతులు కరువే. చాలినన్ని టాయిలెట్లు, బాతురూంలు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తాగునీటిని డబ్బాల ద్వారా తెచ్చుకుంటున్నారు. క్రోసూరులోని కాలేజీ బీసీ సంక్షేమ వసతి గృహం, పాఠశాల బీసీ సంక్షేమ వసతి గృహం రెండూ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. పాఠశాల బీసీ సంక్షేమ వసతి గృహంలో 110 మంది విద్యార్థులుండగా నాలుగు టాయిలెట్లు, నాలుగు బాత్ రూంలు మాత్రమే ఉన్నాయి.

- మండలంలోని దొడ్లేరులో మాత్రం ప్రభుత్వ భవనంలో బీసీ సంక్షేమ వసతి గృహం నిర్వహిస్తున్నారు.



దొడ్లేరులోని హాస్టల్‌లో టాయిలెట్లు, బాత్‌రూంలు



క్రోసూరులోని బీసీ హాస్టల్‌లో టాయిలెట్లు

అధికారులపై చర్యలు తీసుకోవాలి

- తెలియకుండానే ఫిర్యాదు క్లోజ్
- ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌లో మాజీ సర్పంచ్ మస్తాన్‌రావు ఫిర్యాదు



జేసీ సూరజ్‌గనోరేకు అర్జీ అందజేస్తున్న మస్తాన్‌రావు

క్రోసూరు: తనకు తెలియకుండానే ఫిర్యాదును పంచాయతీ విస్తరణాధికారి జి.శ్రీనివాస్, కార్యదర్శి రవికుమార్ పరిష్కరించినట్లు క్లోజ్ చేశారని ఆవులవారిపాలెం మాజీ సర్పంచ్ కొండవీటి మస్తాన్‌రావు ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు సంవత్సరాల కిందట సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామంలో కొన్ని అభివృద్ధి పనులు చేశానని తెలిపారు. బిల్లులను అప్పటి సెక్రటరీలుగా పనిచేసిన షేక్ గౌస్ , మహమ్మద్ రసూల్‌లు వారి బంధువుల ఖాతాల్లోకి బదిలీ చేసుకున్నారని ఆరోపించారు. దీనిపై గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి, పల్నాడు జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన సమస్యను వారు పరిష్కరించలేదని, తనకు రావలసిన డబ్బులు ఇప్పించలేదని వాపోయారు. దీనిపై గత నెల రెండవ తేదీన నరసారావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదును రిజిస్టర్ చేసి, జూలై రెండవ తేదీ లోపు పరిష్కారం చేస్తారని తెలిపినట్లు చెప్పారన్నారు. అయితే, మండల పంచాయతీ విస్తరణాధికారి , గ్రామ పంచాయతీ కార్యదర్శి తనకు తెలియజేయకుండా ఫిర్యాదు పరిష్కరించినట్లు, వారే సంతకాలు పెట్టి క్లోజ్ చేసినట్లు ఆరోపించారు. వారు ఇచ్చిన లెటర్‌తో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కూడా సమస్య మూసేశారని తెలిపారు. తనకు తెలియకుండా క్లోజ్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జేసీ సూరజ్ గనోరే ఫిర్యాదు చేసినట్లు మస్తాన్‌రావు తెలిపారు.

కంకణాలపల్లిలో "సుపరిపాలనలో తొలి అడుగు'

సత్తెనపల్లి: మండలంలోని కంకణాలపల్లిలో శనివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలిసి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ అందిస్తామని తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభమవుతుందని వెల్లడించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇప్పటికే తల్లికి వందనం పథకం అమలు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీల్లో 80 శాతం పూర్తి చేశామని చెప్పారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణతో పాటు వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశం కోసం పోరాడే ప్రతి పౌరుడు సైనికుడే !

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సీఐ విజయ్ కుమార్



రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు సన్మానం

సత్తెనపల్లి: దేశం కోసం పోరాడే ప్రతి పౌరుడు సైనికుడేనని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మై భారత్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మేరా యువ భారత్ గుంటూరు (మై భారత్) సౌజన్యంతో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వ హించిన కార్గిల్ విజయ్ దివాస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారత సైనిక చరిత్రలో అత్యంత ముఖ్యమైన విజయాలలో ఒకదానికి గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై 26న కార్గిల్ విజయ్ దివాస్‌ను జరుపుకుంటున్నామని తెలిపారు. కార్గిల్ యుద్ధంలో 500 మందికి పైగా భారతీయ సైనికులు దేశం కోసం త్యాగం చేశారని వివరించారు. అనంతరం రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది విజయ్ కుమార్, షేక్ మొహమ్మద్ ఆయుబ్, ఎం. పుల్లయ్యను ఘనంగా సన్మానించారు. ముందుగా దేశం కోసం ప్రాణాలర్పించిన యువ తేజం మురళి నాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్గిల్ విజయ్ దివాస్‌పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, ఆరుగురు విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థులతో జాతీయ జెండాలతో ర్యాలీతో పాటు మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి కృష్ణారెడ్డి, టీచర్ మస్తాన్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ ఎం. రమేష్, శ్రావణి, మీరాబి, విద్యార్థులు, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

క్రోసూరు: దోమల ద్వారా, నీటి కలుషితం ద్వారా వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యాంసన్ సూచించారు. క్రోసూరులోని ఎస్టీ, బీసీ కాలనీల్లో శనివారం డెంగీ, అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శ్యాంసన్ మాట్లాడుతూ దోమల వ్యాప్తిని అరికట్టడానికి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిలవ లేకుండా చూడాలని తెలిపారు. వారానికి ఒక్కసారి కిరోసిన్ గానీ మడ్డి ఆయిల్‌ను గానీ చల్లితే దోమల పుట్టుకను అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ప్రేమ రాజ్, ప్రహ్లాద్, ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తరగతి గదులకు వెళ్లే దారేది ?



బెల్లంకొండ: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో వర్షపు నీరు మోకాళ్లలోతు నిలిచిపోయింది. బయటకు వెళ్లేందుకు వీల్లేక పోవడంతో రోజుల తరబడి నిల్వ ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులకు, మరుగుదొడ్లకు వెళ్లాలంటే ఆ బురద నీటిలోనే నడుచుకుంటూ వెళ్లాలి. వర్షం పడిన ప్రతిసారి ఇదే విధంగా మైదానంలో రోజుల తరబడి నీరు నిలిచి పోతోంది. అధికారులు వెంటనే స్పందించి నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు బానిసలైతే భవిష్యత్ చిత్తు

సీఐ శ్రీనివాసరావు




మాట్లాడుతున్న సీఐ

అచ్చంపేట: విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలు కావద్దని, చదువులపై దృష్టి సారించి తల్లి దండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని అచ్చంపేట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. మత్తు పదార్థాల వల్ల అనర్థాలపై శనివారం ఆయన స్థానిక గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్, గుట్కా, సిగిరెట్లు మద్యపానానికి అలవాటు పడడం వల్ల వచ్చే ప్రమాదాల గురించి వివరించారు. ఎక్కడైనా డ్రగ్స్ వ్యాపారం చేసే వారిని గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

నాలుగు రోడ్ల కూడలిలో ...

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆన్‌లైన్, బ్యాంకు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా ద్వారా వేధింపుల గురించి వివరించారు. అనుమానాస్పద లింకులు, కాల్స్, సందేశాలు అందుకున్నప్పుడు స్పందించవద్దని తెలిపారు. ఈ సమయంలో సైబర్ హెల్ప్‌లైన్ 1930 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండని వారు వాహనాలు నడపడం చట్టపరంగా నేరమని తల్లి దండ్రులకు తెలియజేశారు. మైనర్ల వాహన డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు, చట్టపరమైన చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనురాధ

నకరికల్లు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అర్హులకు పథకాలు చేరేలా కృషి చేయాలని ఎంపీపీ మేచారపు అనురాధ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. శాఖలవారీగా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయా శాఖల అధికారులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.పుల్లారావు, ఎంపీడీఓ జి.కాశయ్య, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, ఏఈలు శ్రీనివాస్, సురేష్‌బాబు, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, సూపర్‌వైజర్ రమీజున్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.